క్లుప్తంగా

'యూత్' ప్రొటోకాల్ చైర్మన్‌గా ఆదిత్య రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు



సీఎం రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆదిత్య రెడ్డి

పటాన్‌చెరు టౌన్: తెలంగాణ యూత్ కాంగ్రెస్ కమిటీ ప్రొటోకాల్ డిపార్ట్‌మెంట్ చైర్మన్‌గా డాక్టర్ పట్లోళ్ల ఆదిత్య రెడ్డి నియామక మయ్యారు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శివసేన రెడ్డి శనివారం హైదరాబాద్‌లో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆదిత్య రెడ్డి మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు నిర్మల, పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్, మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా నర్సింహారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆతిక్, నాయకులు ధీరజ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రారంభం

నారాయణఖేడ్: మండలంలోన రుద్రారంలో రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ తృతీయ వార్షికోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా మొదటి రోజు స్వస్తి పుణ్యాహ వచనం, మహా గణపతి పూజ, నవగ్రహ మండపారాధన, ఆవాహిత దేవతారాధన, ఎల్లమ్మతల్లికి హోమం, 108 కలశాలతో అష్టోత్తర ఘటాభిషేకం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, మహామంగళ హారతి, మంత్రపుష్పం, రాజోపచారసేవ, ఆశీర్వచనం, తీర్థప్రసాదాల వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

నేటి నుంచి భూ లక్ష్మమ్మ జాతర



ఆలయంలో వెలిసిన అమ్మవారు

నారాయణఖేడ్: మండలంలోని తుర్కాపల్లి భూలక్ష్మమ్మ ఆలయం జాతరకు ముస్తాబైంది. ఆదివారం నుంచి జాతర ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా సాగనున్నాయి. ఇందుకోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. జాతరకు సంబంధించి మొట్టమొదటి పూజా కార్యక్రమాలు, బండ్ల ఊరేగింపుతో ఎల్గోయి గ్రామస్తులు ప్రారంభిస్తారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు అమ్మవారికి పూజ, నైవేద్యాల సమర్పణ, సాయంత్రం బండ్ల ఊరేగింపు, రాత్రి బోనాల ప్రదర్శన, భజన, కీర్తనలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో కామారెడ్డి జిల్లా ధర్మారానికి చెందిన బండ్లు కూడా పాల్గొనడం విశేషం.

నిరుపేదలకు చేయూత



నిత్యావసర సరుకులు అందజేస్తున్న యువకులు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మార్డికి చెందిన ఎన్ఆర్ఐ గుర్రపు మశ్చేందర్ శనివారం నిరుపేద కుటుంబానికి నిత్యావసర వస్తువులు అందజేశారు. ఖానాపూర్(కె)కు చెందిన సాబేరబీ ఇటీవల అనారోగ్యంతో మరణించింది. ఆకుటుంబానికి నెల రోజులకు సరిపడా సరుకులు పంపిణీ చేశారు.

మట్టి టిప్పర్ సీజ్

పాపన్నపేట(మెదక్): ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్‌చేశామని ఎస్ఐ నరేశ్ తెలిపారు. మండల పరిధిలోని పోడ్చన్‌పల్లివైపు నుంచి ఏడుపాయల కమాన్ వైపు అనుమతులు లేకుండా మట్టిని నింపుకొని వెళ్తున్న టిప్పర్‌ను శనివారం సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఆయన చెప్పారు. తదుపరి చర్యల కోసం తహసీల్దార్, అధికారులకు సిఫారసు చేసినట్లు తెలిపారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

కొండాపూర్(సంగారెడ్డి): మండలంలోని మారేపల్లిలో నాలుగు రోజులుగా లక్ష్మీనారాయణ స్వామి ఆలయ 7వ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం వైకుంఠపురం ఆలయ ప్రధాన అర్చకులు కందాడై వరదాచార్యుల ఆధ్వర్యంలో వేద పండితుల సమక్షంలో స్వామివారి కల్యాణం కన్నుల పండుగగా జరిగింది. కాగా, చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి.అనంతరం సాయంత్రం గ్రామ వీధుల్లో రథోత్సవం జరిగింది. ఈ ఉత్సవాల్లో సంగారెడ్డి శాసనసభ్యుడు చింతా ప్రభాకర్ తనయుడు చింతా సాయినాథ్, ఎంపీపీ మనోజ్‌రెడ్డి, నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

కలశాలతో ఊరేగింపు



పట్టణంలో పసుపు రంగు వస్త్రధారణతో కలశాల ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

సదాశివపేట(సంగారెడ్డి): వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు శనివారం పట్టణంలో వైభవంగా జరిగాయి. ఆర్యవైశ్య మహిళలు పసుపు రంగు వస్త్రధారణ ధరించి కలశాలతో ఊరేగింపుగా మాత మందిరం వద్దకు ప్రధాన వీధుల గుండా చేరుకున్నారు. అనంతరం అమ్మకు అభిషేకం, సూక్తహోమం, కుంకుమార్చన, లలిత సహస్రనామ పారాయణం, మహాహారతి, భజన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం మందిర ఆవరణలో ఉత్సవ విగ్రహంతో శోభాయాత్ర చేపట్టారు.

ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం



దుక్కి దున్నుతున్న రైతు

జహీరాబాద్ టౌన్: నియోజకవర్గంలో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. పొలాలను దుక్కిదున్ని విత్తనాలను నాటేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం సూచించిన మేరకు పంటలను సాగుచేయాలని రైతులు నిర్ణయించారు. జహీరాబాద్ మండలంలో 14,992 మంది రైతులు ఉండగా ఝరాసంగం మండలంలో 13,908 మంది, కోహీర్ మండలంలో 13,780 మంది, మొగుడంపల్లి మండలంలో 10,217 మంది న్యాల్‌కల్ మండలంలో 16,955 మంది రైతులు ఉన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో వర్షాకాలంలో ప్రధానంగా పత్తి, కంది, పెసర, మినుము, సోయాబీన్ తదతర పంటలను రైతులు ఖరీఫ్‌లో పండిస్తుంటారు. ఈ మేరకు అన్నదాతలు ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు. సాగుకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు సిద్ధం చేసుకోవడానికి పెట్టుబడి అవసరంకాగా డబ్బులు ముందుగానే సమకూర్చడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. పెట్టుబడి కోసం ఖరీఫ్ సీజన్ రైతుబంధు డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు. వానాకాలం ప్రారంభానికి ముందే వ్యవసాయ డివిజన్‌లో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు పొలం పనుల్లో బిజీగా ఉన్నారు. పంటల సాగుకు ప్రభుత్వం ఖరీఫ్‌కు సంబంధించిన రైతుబంధు డబ్బులు వెంటనే విడుదల చేయాలని కోరుతున్నారు. ఈ సారి వానలు సమృద్ధిగా కురుస్తాయని శాస్త్రవేత్తలు ప్రకటించడంతో పంటలు బాగా పండుతాయన్న ఆశాభావం రైతుల్లో కనిపిస్తోంది.

సబ్‌స్టేషన్ స్థలం చదును

- మొరం వేయడానికి ముందుకొచ్చిన ఓ రియల్ సంస్థ

సాక్షి ఎఫెక్ట్



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, తదితరులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : తెల్లాపూర్‌లో సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలం కేటాయించినా గుంతల కారణంగా ఇప్పటి వరకు సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయలేదు. ఈ సమస్యపై 10వ తేదీన సాక్షి దినపత్రికలో 'సబ్‌స్టేషన్ ఏర్పాటుపై నిర్లక్ష్యపు నీడలు' అనే శీర్షిక ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనానికి ఓ రియల్ ఎస్టేట్ సంస్థ స్పందించింది. తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర గారి రమణ ఏపీఐ ఇన్‌ఫ్రా సంస్థ దృష్టికి తీసుకెళ్లారు. సబ్ స్టేషన్‌కు కేటాయించిన స్థలంలో ఆ సంస్థ సుమారు రూ.10 లక్షలకు పైగా విలువైన 200 టిప్పర్ల మొరంను శనివారం పోయించారు. మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, ఏఈ సంజయ్, తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసిమేషన్ అధ్యక్షుడు రమణ పరిశీలించారు. మొరం పోయిస్తున్న ఏపీఐ ఇన్‌ఫ్రా సంస్థ ప్రతినిధులకు రమణ కృతజ్ఞతలు తెలిపారు.

వీరబ్రహ్మేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మునిపల్లి(అందోల్): మండలంలోని బుదేరా గ్రామ శివారులో వీరబ్రహ్మేంద్ర స్వామి 32వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి గ్రామ సర్పంచ్ మన్నే గౌరమ్మ ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ రాజేశ్వర్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అందుబాటులోకి సీసీ రోడ్డు

- మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్

తూప్రాన్: మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో ప్రజల సౌకర్యార్థం నిర్మించిన సీసీ రోడ్డును మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శనివారం మాట్లాడుతూ సీసీరోడ్డు నిర్మాణానికి బడ్జెట్ సరిపోకపోవడంతో తాను ఇన్‌చార్జి చైర్మన్‌గా ఉన్నప్పుడు జనరల్ ఫండ్ నుంచి రూ.3లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. మిగిలిన18 మీటర్ల సీసీ రోడ్డును వారం రోజుల క్రితం పూర్తిచేశామని, క్యూరింగ్ పూర్తి కావడంతో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తూ ప్రభుత్వం నుంచి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అల్లపురం సిద్దిరాములు, వార్డు ఇన్‌చార్జి ఆఫీసర్ కుమార్, మున్సిపల్ జవాన్లు ఇర్ఫాన్, వినోద్, సఫాయి సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆర్థిక సాయం అందజేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీకి చెందిన ఓ ఆటో డ్రైవర్ క్యాన్సర్ వ్యాధితో ఇబ్బందులు పడుతుడడంతో అతడి కుటుంబానికి శనివారం ఏకే ఫౌండేషన్ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖదీర్ ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.10 వేల నగదు, బియ్యంను అందించినట్లు పేర్కొన్నారు. తమ సంస్థ ద్వారా పేదలకు సహాయ, సహకారాలు అందిస్తున్నామని వివరించారు.

◆ ఘనంగా కన్యకా పరమేశ్వరీ జయంతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతీనగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీలోని కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో జరిగిన అమ్మవారి జయంతి వేడుకల్లో శనివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పనగేష్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, నాయకులు ఆదర్శ్‌రెడ్డి, పరమేష్, ఐలేశ్‌తదితరులు పాల్గొన్నారు.

◆ అన్నదాన కార్యక్రమం..

పటాన్‌చెరు : పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శ్రీ కోదండ సీతారామయ్య స్వామి దేవస్థానంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రతీ శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసింది. ఈ క్రమంలో శనివారం కార్పొరేటర్ సోదరుడు ఎల్లేశ్ యాదవ్ అన్నదానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శించుకొని అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు.

◆ ఆరాధన మహోత్సవం

నారాయణఖేడ్: మండలంలోని పోతన్‌పల్లి(ఆర్)లో శనివారం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాముల వారి ఆరాధన మహోత్సవాలను ఆశ్రమ నిర్వాహకులు వడ్ల విఠలాచారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజ, యజ్ఞంతో పాటు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

◆ కొనసాగుతున్న మహోత్సవాలు

నారాయణఖేడ్: మండలంలోని లింగాపూర్ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు రెండో రోజు శనివారం కొనసాగాయి. ఈసందర్భంగా లాజహోమం, వెంకటేశ్వర కల్యాణం, బండ్ల ప్రదక్షణ, నల్లపోచమ్మ వీధినాటకం మొదటి భాగం ప్రదర్శన కార్యక్రమాలను నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళిక సంఘ సభ్యులు నగేష్ షెట్కార్, పంచాగామ మాజీ ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ బాధ్యులు వారిని సత్కరించారు.

హుండీ లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

రాయికోడ్(అందోల్) : మండల కేంద్రం రాయికోడ్‌లోని వీరభద్రేశ్వర ఆలయ హుండీని శనివారం లెక్కించారు. 26 రోజులకు సంబంధించిన కానుకలను దేవాదాయ ధార్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, ఏఈ మోహన్‌రెడ్డి సమక్షంలో లెక్కించారు. మొత్తం రూ.1,54,827 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకట్‌రెడ్డి, ఆలయ సిబ్బంది, అర్చకులు, నాయకులు కృష్ణ, బస్వరాజ్ స్వామి, శివ కుమార్ స్వామి, వీరయ్య స్వామి, మల్లికార్జున్, మాణయ్య, రాచయ్య స్వామి, ఈశ్వరయ్య స్వామి, వెంకటేశం, నారాయణ తదితరులు ఉన్నారు.

8తులాల బంగారు గొలుసు చోరీ

జహీరాబాద్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న క్రమంలో మహిళ మెడలో నుంచి బంగారం చోరీ అయినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం ఝరాసంగం మండలంలోని చీలపల్లి గ్రామానికి చెందిన లక్ష్మి సంగారెడ్డి వెళ్లేందుకు జహీరాబాద్ బస్టాండ్‌లో బస్సు ఎక్కింది. బస్సు ఎక్కగానే మెడలోని 8 తులాల బంగారు గొలుసు కనిపించలేదు. బస్సు ఎక్కుతున్న క్రమంలోనే గుర్తు తెలియని వ్యక్తులు గొలుసు దొంగిలించినట్లు గ్రహించింది. దీంతో ఆందోళనకు గురైన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

26న ప్రవేశ పరీక్ష

రామాయంపేట(మెదక్): ఆవాస విద్యాలయంలో ప్రవేశానికి ఈ నెల 26న పరీక్ష నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ప్రభుత్వ లేదా ప్రైవేట్ పాఠశాలల్లో చదవడానికి ఆసక్తి ఉంటే తామే సంస్థ తరఫున డబ్బులు చెల్లిస్తామని వారు పేర్కొన్నారు. స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ శిక్షణ ఇస్తామని, విద్యార్థులు తమ దరఖాస్తులను రామాయంపేటలోని స్వామివివేకానంద విద్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఘనంగా వాసవీమాత జయంతి



పూజలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్య మహిళలు

జోగిపేట(అందోల్): జోగిపేట ఆర్యవైశ్య సంఘం, మహిళా సంఘం ఆధ్వర్యంలో శనివారం శ్రీ వాసవీ మాత జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక వాసవీ కల్యాణ మండపంలోని ఆలయం వద్ద నుంచి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై శ్రీవాసవీ మాత చిత్రపటం ఊరేగింపు ప్రారంభించారు. ఊరేగింపులో ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యుల కోలాటం ఆకట్టుకుంది. ఊరేగింపు అనంతరం వాసవీ మాతకు కుంకుమార్చన చేసి ఒడిబియ్యం సమర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బస్వ సత్యప్రకాష్, కార్యదర్శి ప్రసాద్, కోశాధికారి రాజు, మహిళా సంఘం అధ్యక్షురాలు పద్మ, కార్యదర్శి మంజుల, కోశాధికారి అనిత, జోగిపేట మున్సిపల్ కౌన్సిలర్ రంగ సురేష్, మాజీ మార్కెట్ చైర్మన్ మల్లికార్జున్, ఆర్యవైశ్య సంఘం నాయకులు రంగ హరిప్రసాద్, బచ్చు ఆనంద్, దయాకర్, రాచకొండ సాయిబాబా, యెదిరే రమేశ్ గుప్త పాల్గొన్నారు.

నారాయణఖేడ్: పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయ ఆవణలో శనివారం పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీమాత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. డోలారోహణం, వాసవీ వ్రతాలు, లలితాసహస్రపారాయణం, అమ్మవారికి ఒడిబియ్యం సమర్పణ తదితర కార్యక్రమాలను పురోహితులు మోహన్ జ్యోషి ఆధ్వర్యంలో నిర్వహించారు.

అన్‌లోడింగ్‌ను వేగవంతం చేయాలి

- ప్రత్యేక అధికారి బ్రహ్మాజీ



చేగుంట(తూప్రాన్): రైస్‌మిల్లులో నిల్వను పరిశీలిస్తున్న అధికారులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు రైస్‌మిల్లులను ఐసీడీఎస్ పీడీ మండల స్పెషల్ ఆఫీసర్ బ్రహ్మాజీ పరిశీలించారు. శనివారం మండలంలోని పలు రైస్ మిల్లులలో ధాన్యం నిలువ స్థాయిని పరిశీలించారు. రైస్ మిల్లుల నిలువ స్థాయికి తగిన ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించి తరలించేందుకు ఈ పరిశీలన నిర్వహిస్తున్నట్టు బ్రహ్మాజీ తెలిపారు. గ్రామాల నుంచి వచ్చిన ధాన్యం లారీలను వెంటవెంటనే అన్‌లోడ్ చేయించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గియాసున్నీసా బేగం, ఆర్ఐ నర్సింగ్ యాదవ్, సర్వేయర్ రవీందర్‌రెడ్డి, ఆయా గ్రామాల రైస్‌మిల్లుల నిర్వాహకులు ఉన్నారు.

కొల్చారం(నర్సాపూర్)లో..

కొనుగోలు కేంద్రాలద్వారా రైస్ మిల్లులకు వచ్చిన లారీలను వెలువెంటనే అన్‌లోడింగ్ చేయాలని నర్సాపూర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి రైస్‌మిల్ సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలో సత్యసాయి పారా బాయిల్డ్ రైస్ మిల్లును ఆయన తనిఖీ చేశారు. ధాన్యం అన్లోడింగ్‌లో తలెత్తుతున్న విషయంపై ఆరా తీశారు. రైతులకు ఇబ్బంది కలగకుండా ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలని అక్కడి తహసీల్దార్ గఫూర్ మియాకు సూచించారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం



శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన దొంతి వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ పూజారి గోపాలశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం హోమం, బలిహారం, ధ్వజారోహణం, ఊరేగింపు, స్వామివారి తిరు కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో ఆలయ నిర్మాణ దాతలు, నిర్వాహకులు పాల్గొన్నారు. ఆదివారం శ్రీదేవి, భూదేవి, సమేత వేణుగోపాలస్వామి పల్లకీసేవ నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు.